ప్రజాశక్తి

శనివారం 19 అక్టోబర్ 2024

పది కేజీల గంజాయి పట్టివేత

పాచిపెంట : మండలంలోని చాపరాయివలస వద్ద పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. శుక్రవారం చాపరాయివలస గ్రామ పర్యటనకు ఎస్ఐతో పాటు సిబ్బంది వెళ్లారు. ఆ గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వారి చేతిలో బ్యాగులు ఉండడం గమనించి, వారిని పట్టుకుని బ్యాగులను తనిఖీ చేసి విచారించగా అందులో సుమారు 10 కేజీల గంజాయిని ఐదు ప్యాకెట్లలో నింపి ఉంది. అనంతరం వారిని విచారించగా ఒకరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూరజ్ బాన్ కాగా, రెండో వ్యక్తి మహారాష్ట్రకు చెందిన జితేంద్రరాజుగా గుర్తించారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఒడిశాలోని పాడువా నుంచి గంజాయిని నరేంద్రసింగ్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్మేందుకు తీసుకెళ్తున్నారు. వీరిపై కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మన్యం ఇక అచ్చెన్న జమానా

ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో చక్రం తిప్పే ఛాన్స్

ప్రజాశక్తి-పార్వతీపురం

మన్యం జిల్లాలో ఇకనుంచి సీనియర్ నేత, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జమానా మొదలు కానుంది. జిల్లా ఇంఛార్జి మంత్రి హోదాలో ఆయన చక్రం తిప్పే అవకాశం కనిపిస్తోంది. అధికారపార్టీలో నివురు కప్పిన నిప్పు లా వున్న గ్రూపు రాజకీయాలకు చెక్ పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎన్నికల ముందు వరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా అచ్చెన్నాయుడు పని చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముఖ్య నాయకులందరితో ఆయనకు సత్సంబంధాలు వున్నాయి. మన్యం జిల్లాలో వున్న నాలుగు నియోజకవర్గాల్లోనూ టిడిపి కూటమి ఎమ్మెల్యే లే వున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే లు, నాయకుల మధ్య సమన్వయం కుదిర్చే అవసరం ఎంతైనా ఉంది. సమీప భవిష్యత్తు లో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. పార్టీ నాయకుల మధ్య అంతర్గత విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.అందుకే సీనియర్ మంత్రి గా అచ్చెన్నాయుడుకు జిల్లా ఇంఛార్జి మంత్రి బాధ్యతలు అప్పగించారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక నుంచి మన్యం జిల్లా యంత్రాంగం మొత్తం ఆయన కనుసన్నల్లో పని చేయాల్సి ఉంటుందనే చర్చ నడుస్తోంది. ఇంతవరకు జిల్లాలో పరిపాలన కొంత అస్తవ్యస్తంగా ఉంది. చాలావరకు ఇంఛార్జులతోనే పాలన నడుస్తోంది. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ లకు రెగ్యులర్ పిఒల నియామకం జరగలేదు. గిరిజన సంక్షేమ డిడి, ఐటిడిఎ కార్యాలయం సూపరింటెండెంట్, గురుకుల ఓఎస్డీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు రెగ్యులర్ గా జరగడం లేదు.గిరిజన సమస్యలు పక్కదారి పడుతున్నాయి.జిల్లాలో గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా వున్నా సంధ్యారాణి పార్టీలో నెలకొన్న గ్రూపు రాజకీయాలపై దృష్టి సారించలేదు. సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ అనుచరులను మంత్రి సంధ్యారాణి దూరం పెడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం తో భంజ్ దేవ్ అనుచరులు అసంతృప్తితో రగిలిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. మంత్రి సొంత నియోజకవర్గంలో పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన నియోజకవర్గాల్లో నూ పార్టీ నాయకుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. పార్వతీపురం నియోజకవర్గం లో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటున్నారు.

స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ల మధ్య దూరం పెరిగింది. కురుపాం నియోజకవర్గం లో టిడిపి గెలుపు కోసం కృషి చేసిన యువనేత వైరి చర్ల వీరేష్ చంద్రదేవ్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మధ్య సమన్వయం అంతంత మాత్రంగానే వుంది. పాలకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే జయకృష్ణ, నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి పడాల భూదేవి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నెలకొంది. తాజా పరిణామాల నేపథ్యంలో జిల్లా ఇంఛార్జి మంత్రి గా అచ్చెన్నాయుడుకు బాధ్యతలు అప్పగించడం సరికొత్త చర్చకు దారితీస్తోంది. జిల్లాలో నెలకొన్న గ్రూపు రాజకీయాలపై దృష్టి సారించి పార్టీని ఏకతాటిపై నడిపించే ఉద్దేశంతో సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడుకు ఇంఛార్జి మంత్రి బాధ్యతలు అప్పగించారనే ప్రచారం జరుగుతోంది. మున్ముందు మన్యం జిల్లా టిడిపి రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది వేచి చూడాల్సిందే.

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి : పిఒ

ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థులు చదువుతో పాటు ఇతర కార్యకలాపాల్లో ఆసక్తి పెంచుకోవాలని ఐటిడిఎ పిఒ అశుతోశ్ శ్రీవాస్తవ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. స్థానిక కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాన్ని (కెజిబివి) శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినుల హాజరు పట్టీని, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. తరగతి గదులను, వంట గదిని పరిశీలించిన ఆయన పదో తరగతి విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. విద్యాలయంలో అందుతున్న విద్యా ప్రమాణాలు, నాణ్యమైన ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఇతర కార్యక్రమాల పట్ల ఆసక్తి ఉండాలన్నారు. ముఖ్యంగా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో నూతన ఉత్తేజం లభిస్తుందని, ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని చెప్పారు. అంతే కాకుండా ఇతర కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేలా చేస్తుందని, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయని గుర్తు చేశారు. అందుకే ప్రతి విద్యార్థి వారికి నచ్చిన కార్యకలాపాల్లో పాల్గొనాలని హితవు పలికారు. ఈ పర్యటనలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు: సీతానగరం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు
- విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పెరిగిన ట్రూ ఆప్ విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ప్రజలపై భారాలు పెంచే స్మార్ట్ మీటర్‌ను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఇఇ కె.గోపాల రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యుత్ విధానాలను కూటమి ప్రభుత్వం అనుసరించబోదని ఎన్నికల ముందు, అనంతరం చంద్రబాబు ప్రకటించారని, గతంలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీలు (ఇందనపు సర్దుబాటు ఛార్జీలు) పేరుతో గత రెండేళ్ల నుంచి నడుస్తున్న రూ.20వేల కోట్లు భారాన్ని ప్రజలపై వేయడాన్ని తీవ్రంగా సిపిఎం ఖండిస్తుందని, ఈ విధానాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని పేర్కొన్నారు. గత ఏప్రిల్ నుంచి ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో నెలకు రూ.600 బిల్లు ఉన్న వారికి వెయ్యి రూపాయలు, రూ.1200 ఉన్నవారికి రూ.3వేలు, ఆపై ఉన్నవారికి రూ.6వేలు పెరిగిన బిల్లులు వస్తున్నాయని అన్నారు. అలాగే గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన తెలుగుదేశం ప్రభుత్వం, ప్రస్తుతం వారి కూటమి కంపెనీలతో ఒప్పందం తెరుచుకుని స్మార్ట్ మీటర్లను విశాఖ, శ్రీకాకుళం లాంటి నగరాల్లో అమలు చేస్తుందని, ప్రస్తుత ఫోన్ రీఛార్జీలా ముందుగా బిల్లులు చెల్లించుకునే ఒత్తిడి పెరుగుతున్నదని తెలిపారు. ప్రజలు, రైతులపై భారాలు వేసే స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గొర్లి వెంకటరమణ, బంటు దాసు, బి.సూరిబాబు, పాకల సన్యాసి రావు, మాన్యం గౌరి, చొక్కా చంద్రబాబు, వెంకటమ్మ, గౌరమ్మ, బలరాం, ప్రభ, పి.రాజశేఖర్, బలరాం, శివున్నాయుడు, పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ఇంధన సర్దుబాటు పేరుతో ప్రజలపై అదనపు భారం వేయడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు రూ.8114 వేల కోట్లు భారాన్ని మోపడం ప్రజలను మోసం చేయడం అవుతుందని విమర్శించారు. ఇలా తప్పుడు నిర్ణయాలు తీసున్నట్లతే ప్రజల తరుపున సిపిఎం ఆందోళనలు చేస్తుందని హెచ్చరించారు. అనంతర విద్యుత్‌శాఖ అధికారులకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరావు, గణేష్, శ్రీను, లింగరాజు పాల్గొన్నారు.

సీతానగరం : ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగాయని, దీంతో ప్రజలు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తక్షణమే పెంచిన ట్రూ ఆప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, మండల కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, బి.అప్పా రావు, ఆర్.రమణ మూర్తి, వై.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వరకు నినాదాలు చేసుకుంటూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్తు స్టేషన్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిపిఎం మండల కార్యదర్శి ఎ.భాస్కర్‌రావు, సర్పంచ్ సుందరమ్మ, పాలక సాంబయ్య, జె.శ్రీరాములు, గంగాధర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బందికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమం టూనే కూటమిని ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని వేయడం దారుణమన్నారు. తక్షణమే ధరలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివుని నాయుడు సింహాచలం కష్ణ పాల్గొన్నారు.

సాలూరు, సీతంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు

అంగన్వాడీలు కృషి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు సరైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్యా బోధన అందించాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని డోకిశీలలో అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు సంబంధించిన మందులను, శానిటైజేషన్ సంబంధించిన సామాగ్రి స్టాక్‌ను పరిశీలించారు. కేంద్రంలోని హాజరుపట్టీని, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించి నిల్వ ఉన్న గుడ్లు, బియ్యం, పప్పు తదితర వివరాలపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్థలాభావాన్ని బట్టి పిల్లలు ఆడుకోవడానికి అనువుగా ఉన్నట్టు పార్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల బరువు, ఎత్తులను గురించి ఆరా తీసిన ఆయన ప్రతి రోజూ పిల్లల వివరాలను నమోదు చేయాలన్నారు. కేంద్రానికి పిల్లలంతా హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించి, పౌష్టికాహారం తీసుకున్న పిల్లల్లో వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండేలా చూడాలని, ఆహారం తీసుకునే విధానం పట్ల తల్లితండ్రులకు అవగాహనా కల్పించాలని చెప్పారు. చిన్నారులు చదువు పట్ల శ్రద్ధ చూపేలా అంగన్వాడి కేంద్రాల్లోనే సరైన బీజాలు పడాలని ఆదేశించారు. చిన్నారులకు ఆట, పాట రూపంలో విద్యా బోధన చేయాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, డిఎల్‌డిఒ రమేష్, తహశీల్దార్ వై.జయలక్ష్మి, ఎంపిడిఒ రూపేష్ కుమార్, సిడిపిఒ శ్రీనివాసరావు, అంగన్వాడీ, ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామ సర్పంచ్, సంపంగి జగదీష్ పాల్గొన్నారు.

చిన్నారులతో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వన్ ధన్ వికాస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మండలంలోని డోకిశీల పంచాయతీ డెప్పివలసలో నిర్మిత మవుతున్న వన్ ధన్ వికాస్ కేంద్రాన్ని (విడివికె) వినియోగించుకోవాలని కలెక్టర్ మహిళలకు పిలుపునిచ్చారు. ఆకస్మిక పర్యటనలో భాగంగా నిర్మితమవుతున్న విడివికెను ఆయన సందర్శించి, ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడి గిరిజను లకు కొండచీపుర్లు తయారీపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, కేంద్రం సిద్ధం కాగానే ఉత్పత్తులు ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. విడివికెలు కేవలం ఒక సీజన్ వస్తువులకే పరిమితం కాకుండా ఏడాది మొత్తం కేంద్రం నుంచి ఉత్పత్తులు వచ్చేలా కృషి చేయాలన్నారు. అల్లికలు, కుట్టుపనులు కొందరు మహిళలు చేస్తుంటారని, వాటిలో కూడా తగిన తర్ఫీదును ఇప్పిస్తామని కలెక్టర్ చెప్పారు. ఇలా ఏడాది మొత్తం విడివికెల నుంచి ఉత్పత్తులు లభించడం ద్వారా మహిళలకు పని, ఆదాయం సమకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో ఈ కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో ఉత్పత్తులు రావాలన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల అన్ని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఐటిడిఎ పరిధిలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, హెచ్‌డబ్ల్యుఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పాఠశాలల్లో జరిగే ప్రతి కార్యక్రమం ఫొటోలను వాట్సాప్ ద్వారా పంపించాలన్నారు. పాఠశాలలో అన్ని తరగతి గదులకు ఫ్యాన్లు ఉండాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలన్నారు. ప్రతిరోజు మూడుసార్లు మరుగుదొడ్లు శుభ్రం చేయించాలన్నారు. పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో విద్యార్థులు నిద్రించే గదుల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులకు సంఖ్యకు తగ్గట్టుగా చికెన్ వండడం లేదని, ఇకపై ఇలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని అన్నారు. జిసిసి ద్వారా మాత్రమే సరుకులను కొనాలని, జిసిసి సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లోపించినట్లైతే వెంటనే తిరిగి ఇచ్చేయాలని సూచించారు. ఎటిడబ్ల్యుఒలు ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పాఠశాలలను పరిశీలించి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని అన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేయాలని, అందరికీ పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేసి, దాన్ని విద్యార్థులు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేనిచోట డెప్యుటేషన్ పద్ధతిలో వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులు మాత్రమే ఉండాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలన్నారు. విద్యార్థులు ఉండి, మూతపడిన జిపిఎస్ పాఠశాలలను వెంటనే తెరిచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎపిఒ జి.చిన్నబాబు మాట్లాడుతూ దసరా సెలవుల అనంతరం వస్తున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఇంకా సికిల్ సెల్ వైద్య పరీక్షలు చేయించుకోని విద్యార్థులకు వెంటనే పరీక్షలు చేయించాలని సూచించారు. గ్రామాల్లో డ్రాపౌట్స్ విద్యార్థులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్ ఫోన్లు ఉపయోగించకూడదని సూచించారు. టీచర్లు డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. జీన్స్, టీ షర్ట్స్ ధరించకూడదన్నారు. ప్రతి బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. సమావేశంలో డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎటిడబ్ల్యుఒలు శ్రీనివాసరావు, మంగవేణి, కృష్ణవేణి, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ, సూపరింటెండెంట్ దేశ్, హెచ్‌ఎంలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

రూరల్ ఎస్ఐపై బదిలీ వేటు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని గోపాలపురానికి యువకుడు రాకేష్ అనుమానాస్పద స్థితి ఇటీవల మృతి చెందాడు. ఈ సంఘటనలో రూరల్ ఎస్ఐ దినకర్ వ్యవహారశైలిపై పోలీసు ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయన్ను విఆర్‌కు బదిలీ చేశారు. ఎస్ఐ దినకర్‌పై ఇటీవల పలు ఆరోపణలు రావడంతో పాటు, రెండు రోజుల క్రితం జరిగిన ఫోక్సో కేసు నిందితుడు ఆత్మహత్య వ్యవహారంలో ఆయన వ్యవహార శైలి అనుమానాస్పదంగా ఉండడంతో, మృతుడి తల్లిదండ్రులు కలెక్టర్ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఆయనపై తీసుకున్న క్రమశిక్షణ చర్యల్లో భాగంగా, విఆర్‌కు పంపిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో రూరల్ ఎస్ఐ సంతోషి కుమారి నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు వాహనాల వేలం

వీరఘట్టం : స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 19న మద్యం తరలింపులో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్సై జి.కళాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో రిక్షా, స్కూటీ, మోపెడ్, హీరో ఫ్యాషన్ బైక్, వాహనాలకు సంబంధించి వేలం పాట నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

పాల సేకరణ ధర తగ్గింపుపై నిరసనలు

ప్రజాశక్తి - సీతానగరం

రైతుల నుంచి సేకరిస్తున్న విశాఖ డెయిరీ పాలధరను ప్రభుత్వం తగ్గించడాన్ని నిరసిస్తూ శుక్రవారం పాడి రైతులు ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. సీతానగరం మండలం కాశీపేట బల్క్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ విశాఖ డెయిరీకి రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పాలు పోస్తున్నారని, అయినా రైతులకు గిట్టుబాటు ధర లేదని, గతంలో ఉన్న ధర కన్నా తక్కువగా రూ.3 తగ్గిస్తున్నట్లు విశాఖ డెయిరీ చైర్మన్ రైతులతో సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయించడం సరైన పద్ధతి కాదని అన్నారు. పెరుగుతున్న దాణా ఖర్చులతో పోలిస్తే ప్రస్తుత ధర గిట్టుబాటు కావడం లేదని, కావున తక్షణమే ప్రస్తుత ధర కన్నా లీటరు పది రూపాయలు చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మి నాయుడు, మండల అధ్యక్షులు బి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, పాడి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, పాడి రైతులు తేలు సూర్యనారాయణ, ధనుంజయ నాయుడు, పి.విశ్వనాథం, టి.బలరాంతో పాటు అంటిపేట, కాసాయపేట, రెడ్డివానివలసకు చెందిన పాడి రైతులు పాల్గొన్నారు.

పాచిపెంట : విశాఖ డెయిరీ యాజమాన్యం వెంటనే స్పందించి పాల ధర పెంచాలని స్థానిక పాల కేంద్రం వద్ద పాల రైతు సొసైటీ అధ్యక్షులు మట్టపర్తి సురేష్ ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. పెరిగే ధరలకు అనుగుణంగా పాల ధర పెంచి పాడి రైతులను ఆదుకోవాలని అన్నారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రైతులకు రావాల్సిన బోనస్‌లు సక్రమంగా అందడం లేదని, రైతు పండించిన పంటకు గిట్టుబాటులేక సంక్షోభంలో ఉండి పాడిపై ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి రైతాంగంపై విశాఖ డెయిరీ యాజమాన్యం ఇలా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. పాల ధర పెంచే వరకూ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు శంకర్రావు, జగ్గయ్యన్న, అప్పలనాయుడు, రామారావు, సేనాపతి లక్ష్మణరావు, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు .

వీరఘట్టం : పాలధర తగ్గించడాన్ని నిరసిస్తూ రైతులు బల్క్ సెంటర్ వద్ద ఆందోళన చేపట్టారు. లీటరు పాలుకు రూ.39.15 ఇవ్వడం అన్యాయమని, గతంలో ఇచ్చిన మాదిరిగానే పాలకు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సూపర్వైజర్‌కు వినతిపత్రం అందజేశారు.

సీతానగరం : మిల్క్ బల్క్ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

గుడి ఎదుటే మద్యం దుకాణం

నిబంధనలకు తూట్లు

ప్రజాశక్తి-పాలకొండ

గుడి, బడికి వంద మీటర్ల దూరంలో మద్యం షాపులు ఉండకూడదన్న నిబంధనలు ఉన్నాయి. అయితే నూతన మద్యం విధానంలో ఆరు దుకాణాలు ప్రయివేటు వారు దక్కించుకున్నారు. కానీ వారు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. పట్టణంలో పురటాల పోలమ్మ ఆలయానికి సమీపంలో మద్యం షాప్ వెలిసింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ఆలయానికి ఎదురుగా మద్యం షాప్ ఉండడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. నిబంధనలు పట్టించుకోవాల్సిన అధికారులు కూడా ఈ ప్రాంతంలో షాప్ ఏర్పాటుకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం నుండి ఈ షాప్ తెరిచి మద్యం విక్రయాలు జరపడంతో ఆలయానికి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సిఐ సూర్యకుమారిని వివరణ కోసం ప్రయత్నించగా తాను భామినిలో ఉన్నాను, ఇక్కడ సిగ్నల్ లేదని సమాధానం ఇచ్చారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

పాలకొండ: స్థానిక కోటదుర్గ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తాత్కాలిక శాశ్వత హుండీలను శనివారం ఉదయం 9గంటలకు లెక్కిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. దేవాదాయ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో హుండీ లెక్కించడం జరుగుతుందని అన్నారు.

20న 'బడిదేవర కొండ'పై రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని బడిదేవర కొండపై అక్రమ మైనింగ్ ప్రారంభమైందని, దీన్ని అడ్డుకునే బాధ్యత మనందరిపై ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు ఈనెల 20న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నామన్నారు. రౌండ్ టేబుల్ జయప్రదం కోరుతూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ 2016లో లైసెన్స్ ఇచ్చి రెవెన్యూ, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఉమ్మడి సర్వేలో రిజర్వ్ ఫారెస్ట్ అని తేలిన తర్వాత 2017లో గ్రానైట్ లైసెన్స్ రద్దు చేశారని , ఇప్పుడు మరల లైసెన్స్ పునరుద్ధరించడం అన్యాయమని అన్నారు. ఈ లైసెన్స్ పునరుద్దరణ చేసిన మైనింగ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి తప్పుడు లైసెన్సులు ఇచ్చారని సిబిఐ కేసుల్లో విచారణలో ఉన్నారని, అతనిచ్చిన లైసెన్సులు రద్దు చేయాలని, లేదా సస్పెండ్ చేయాలే గాని ప్రభుత్వం అలా చేయడం లేదని తెలిపారు. ఏ కొండ మీద గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చారో అదే కొండపై గ్రానైట్ లైసెన్స్ ఇచ్చారని, ఇదంతా అక్రమమే అని వాపోయారు. దీనిపై చర్చించి తగు కార్యక్రమం తీసుకునేందుకు స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి కనకలక్ష్మి

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మామిడిపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సాలూరు సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో గల వసతి సౌకర్యాలను, భోజనశాలను పరిశీలించి, విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. హాస్టల్‌లో ప్రతి విద్యార్థినితో మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకొని, ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు సాధించాలని, వసతి గృహంలో అందుతున్న వసతులు, సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి ఎ ఎస్ఐ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థికి స్వీట్ తినిపిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర చదరంగం పోటీలకు సంస్కృత పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి -పార్వతీపురం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాస్థాయిలో నిర్వహించిన చదరంగం పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థి చి.వల్లెపు ధనంజయరాజు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోర్జ హేమ సుందర రావునాయుడు తెలిపారు. అనంతపురంలో ఈనెల 29 ,30తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ధనుంజయరాజు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఎంపికకై గైడ్ టీచరుగా ఎంతో శ్రమించిన ప్రముఖ భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఉత్తరావిల్లి గోవిందరావును, సంస్కృత పండితులు జె.బి. తిరుమలాచార్యులను అభినందించారు. ఈ సందర్భంగా గోర్జ కోటేశ్వరరావు,చొక్కాపు శ్రీనివాసరావు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అనుపోజు వరలక్ష్మి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వేమకోటి నరహరి శాస్త్రి తదితరులు విద్యార్థిని ప్రశంసించారు.

గ్రామసభలో సమస్యలు గుర్తించండి : జెసి

ప్రజాశక్తి - పాలకొండ

గ్రామ సభల్లో సమస్యలు గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక అన్నారు. శుక్రవారం కోటదుర్గ ఆలయ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ-సర్వే జరిగిన గ్రామాల్లో ఖచ్చితంగా గ్రామ సభలు ఏర్పాటు చేసి, అక్కడ రైతులకు ఎదురయ్యే సమస్యలను గుర్తించాలన్నారు. రీ సర్వేలో వచ్చిన పొరపాట్లను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముటేషన్లు పెట్టించి ఆ సమస్యలను త్వరగా పరిష్కారించాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లావణ్య కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల మృతి చెందిన విద్యార్థి సవర లావణ్య కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆదివాసీ మాతృ బహుభాష సంఘం రాష్ట్ర కార్యదర్శి సవర డొంబు అన్నారు. మండలంలోని కారెంకొత్తగూడ పంచాయతీలో వంబరెల్లికి చెందిన సవర లావణ్య ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. ఆ కుటుంబానికి ఐటిడిఎ అధికారులు ఆదుకోవాలని కోరారు. ఏకలవ్య పాఠశాలలో ఆదివాసీ మాతృ భాష మాట్లాడే సిబ్బంది ఉంటే ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నం చేసిది కాదన్నారు. ఆ కుటుంబానికి తగినంత న్యాయం జరిగేలా అధికారులు స్పందించాలని తల్లిదండ్రులు కమిటీ తరుపున డిమాండ్ చేశారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ

ప్రజాశక్తి - వీరఘట్టం

తూటికాడ కషాయం వల్ల వరికి సోకే దోమపోటును నివారించ వచ్చునని మండల యాంకర్ మారుతి సింహాచలం రైతులకు సూచించారు. మండలంలోని చలివేంద్రలో తూటికాడ కషాయంపై అవగాహన కల్పించారు. తూటికాడ కషాయం తయారు చేయు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 30 లీటర్ల కషాయం తయారు చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ సిసి ఆనందరావు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

ఇండస్ట్రియల్ ఎక్స్ ప్లోజర్‌లో పరిశ్రమల అవగాహనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రావాడ రామభద్రపురంలో ఉన్న సతీష్ రాయ్ పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు శాంత, సింహాచలం, హరికృష్ణ, కృష్ణారావు విద్యార్థులను తీసికొని పరిశ్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. సుమారు 48 మంది విద్యార్థులు పాల్గొని అక్కడి సిబ్బంది ఇచ్చే సమాచారాన్ని సేకరించారు. పామాయిల్ ముడిసరుకు, పామాయిల్ తయారీ విధానం, అమ్మకం లాభనష్టాలు సిబ్బంది వివరించగా విద్యార్థులు తమ పుస్తకాల్లో రాసుకున్నారు. సక్రమంగా నడిస్తే లాభాలు వస్తాయని గ్రహించారు. విద్యార్థులు స్వయం వ్యాపార రంగంలో మెలకువలు తెలుసుకోడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

పామాయిల్ పరిశ్రమను పరిశీలిస్తున్న విద్యార్థులు

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి -భామిని

ప్రతి పంచాయతీలోని ప్రతి గ్రామం అభివృద్ధికే పల్లె పండుగ కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపట్టిందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని చిన్నదిమిలిలో రూ.కోటీ20 లక్షలతో లోకానాథం స్వామి దేవాలయానికి సిసి రహదారిని, మరో రూ.కోటీ 20లక్షలతో లివిరి కూడలి నుంచి లివిరి గోపినాథ స్వామి దేవాలయం వరకు సిసి రోడ్డు, బత్తిలిలో రూ.కోటీ 20లక్షలతో నీలకంటేశ్వర స్వామి దేవాలయానికి సిసి రహదారి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పంచాయతీలో ప్రతి గ్రామం అభివృద్ధి చెంది, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగై, ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని జయకష్ణ అన్నారు. కార్యక్రమంలో మండలం టిడిపి అధ్యక్షులు బి. రవి నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, అశోక్, ఐటిడిఎ ఇఇ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కురుపాం మేజర్ పంచాయతీ శివన్నపేటలో సర్పంచ్ జి.సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా కూటమి నాయకులు కెవి కొండయ్య, ట్రైకార్ బోర్డు సభ్యులు పి.లావణ్య, జనసేన నాయకులు ఎన్.వంశీ ఉపాధి హామీ నిధులతో మంజూరైన రూ.3లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే మండలంలోని గుమ్మడిగూడ, గుమ్మ, బియ్యాలవలస, కిచ్చాడ గ్రామాల్లో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఇఒపిఆర్‌డి జి.రమేష్ బాబు, ఎపిఒ పి.బావాజీ, జెఇ పి.నాగేశ్వరరావు పలువురు కూటమి

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

నాయకులు. స్థానిక సర్పంచులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని గాదెలవలస, కోట సీతారాంపురం, కాశీపేటలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో బిటి, సిసి రోడ్లు నిర్మాణ పనులు ఉపాధి హామీ ద్వారా జరుగుతాయని, ఈ పనులను వేగవంతం చేయాలని అన్నారు. ముందస్తుగా పనులు ప్రారంభించి మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. అలాగే అంటిపేటలో పల్లెపండుగ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు బి.తిరుపతిరావు, టిడిపి నాయకులు, మాజీ జడ్పిటిసి చంటి వెంకట అప్పలనాయుడు, తేలుచంద్రశేఖర్, తేలు తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని మిర్తి వలసలో పల్లె పండగ కార్యక్రమం ఎంపిడిఒ విజయలక్ష్మి సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమలో భాగంగా గ్రామంలో రూ.4.5 లక్షలతో సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇంకా గ్రామంలో అభివృద్ధి పనులను స్థానిక సర్పంచు గుర్తించాలని, ఇతర పనుల కోసం సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకొని గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజవతి, సర్పంచ్ భాస్కరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కేదారిపురంలో 160 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణ పనులకు కురుపాం నియోజకవర్గం జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వం రావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, పంచాయతీరాజ్ జెఇ మురళి ఉన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని నాగూరులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. నాగూరు ఎంపిటిసి సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు మాట్లాడుతూ పల్లె పండుగ వారోత్సవాల్లో నిర్వ హిస్తున్న "పల్లెపండుగ" పనుల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కేతిరెడ్డి అచ్యుతరావు, అక్కేన వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

హాజరుకాని అధికారులపై కలెక్టర్ కు ఫిర్యా దు

పంచాయతీల అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని మండల టిడిపి అధ్యక్షులు తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మండల అధికారులు ఎవరూ హాజరు కాకపోవడం ఆశ్చర్యంగా ఉందనిపేర్కొన్నారు.

1 నుంచి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలోని ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలోని అరవై ఏళ్ళ పైబడిన అవ్వా, తాతలకు కంటి చూపు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, విద్యా శాఖ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 1నుంచి గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించనున్న కంటి చూపు స్క్రీనింగ్ పరీక్షల శిబిరం సమయాన్ని ముందుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ అనంతరం అవసరమైతే అవ్వా, తాతలకు కళ్లద్దాలు, కేటరాక్ట్, కొయ్య కొండ(టెరిజియం) వంటి శస్త్ర చికిత్సలు చేయించాల్సి వస్తే వారికి ప్రభుత్వం ఉచితంగా చేస్తుందన్నారు. అధికారులు సమన్వయంతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల, ప్రయివేట్ ఆసుపత్రుల భాగస్వామ్యంతో కంటి చూపు స్క్రీనింగ్ పరీక్షలు జరగాలని అన్నారు. గత ఆగస్టు నెల నుంచి మూడు నెలల పాటు ప్రభుత్వ పాఠశాల, ఎయిడెడ్ పాఠశాలల్లో జిల్లా అంధత్వనివారణ సంస్థ, జిల్లా విద్యా శాఖ అధికారులు సంయుక్తంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి చూపు స్క్రీనింగ్ పరీక్షలు 260 పాఠశాలల్లో పూర్తయినట్లు డిఇఒ జి.పడాలమ్మ తెలిపారు. 52, 132 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 16035 మందికి కళ్లద్దాలు అందజేయాల్సి ఉందని వివరించారు. సమావేశంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ వాగ్దేవి, వినోద్, ఐసిడిఎస్ పిఒ ఎమ్.ఎన్.రాణి, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కెపై ఉన్న జగన్ చిత్రం తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కత్తులకవిటిలో రైతు సేవా కేంద్రం భవనంపై ఉన్న మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని అధికారులు శుక్రవారం తొలగించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల బేఖాతరు అన్న శీర్షికన శుక్రవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మండలం కత్తుల కవిటిలో రైతు సేవా కేంద్రంపై ఉన్న జగన్ ఫొటోను తొలగించారు.

అధికారుల్లేక అభివృద్ధికి నోచని మన్యం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా, పేరుకే జిల్లా అని, పాలన మాత్రం సున్నా అని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి, జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొత్త జిల్లా ఏర్పాటు చేసిన వైసిపి ప్రభుత్వం, జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనగానీ, పూర్తిస్థాయి అధికారుల నియామకంగానీ చేపట్టలేదన్నారు. పోనీ కూటమి ప్రభుత్వమైనా జిల్లాకు న్యాయం జరుగుతుందంటే దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా అటువంటి జాడ కానరాలేదన్నారు. ముఖ్యంగా జిల్లాలో కీలకమైన శాఖలకు అధికారులు లేకపోవడంతో జిల్లాలో పాలన కుంటుపడుతోందన్నారు. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎలకు పిఒలు లేక ఇన్చార్జిల పాలనలో గిరిజనాభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. పార్వతీపురం ఐటిడిఎకు దాదాపు నాలుగున్నర ఏళ్లుగా సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడం చూస్తుంటే గిరిజనులపై పాలకులకున్న కపట ప్రేమ వ్యక్తమతోందని విమర్శించారు. జిల్లాలో కీలకమైన శాఖల అధికారుల ఖాళీగా ఉండడంతో ఆయా శాఖల్లో పాలన మందగించిందన్నారు. ఇప్పటికైనా మన్యం జిల్లాపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అన్ని శాఖల అధికారులను భర్తీ చేసి అభివృద్ధి త్వరితగతిన జరిగేలా నిధులు మంజూరు చేయాలని కోరారు.

32 మరుగుదొడ్లు మంజూరు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పక్కా భవనాలున్న అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు నిర్మించేందుకు మండలానికి 32 మరుగుదొడ్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ డి.కావ్యశ్రీ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఒక్కొక్క మరుగుదొడ్డికి రూ.36వేలు ఉంటుందని, శిశు సమగ్ర పథకం ద్వారా మరుగుదొడ్లను నిర్మించినున్నట్లు ఆమె తెలిపారు.

ఇసుక విధానం అస్తవ్యస్తం

టిడిపికో రూలు, వైసిపికో రూలా?
మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఇసుక విధానం అమలులో టిడిపి నాయకులకో రూలు, వైసిపి నాయకులకో రూలు అమలు చేస్తే అధికారులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర హెచ్చరించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి నాయకులు చెప్పిన దానికి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న తీరుకు స్పష్టమైన తేడా కనిపిస్తోందని చెప్పారు. ఉచిత ఇసుక అని చెపుతూ లేనిపోని ఆంక్షలు ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇసుక విధానంపై స్పష్టత లేదని చెప్పారు. నియోజకవర్గంలో కొన్ని చోట్ల ఇసుక రీచ్‌లపై టిడిపి నాయకుల గుత్తాధిపత్యం కొనసాగుతోందన్నారు. ఇసుక తరలింపులో ఎలాంటి ఆంక్షలు లేవని, ఎవరికి అవసరమైనంత వారు తీసుకెళ్లవచ్చునని సిఎం చంద్రబాబు ఒకవైపు చెపుతుంటే అధికారులు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కొద్దిమంది నాయకులకు చెందిన ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, వైసిపి నాయకులు ట్రాక్టర్లతో తరలిస్తే కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. కొద్దిరోజుల క్రితం పాచిపెంట మండలం పాంచాలి రీచ్ నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకుని వదిలేయడానికి కారణమేమిటని ప్రశ్నించారు. అన్నా క్యాంటీన్ నిర్మాణానికి ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని ప్రభుత్వం ఎక్కడా ఉత్తర్వులు జారీ చేయలేదని చెప్పారు. అన్న క్యాంటీన్‌కు ఇసుక వేశారని పెట్టుకున్న ట్రాక్టర్‌ను వదిలేసినట్లు తహశీల్దార్ చెప్పడం సరికాదన్నారు. కొద్దినెలల క్రితం శివరాం పురం రీచ్ నుంచి ఇసుక తరలిస్తున్న వైసిపి సర్పంచ్ జర్జాపు మోహన్ ట్రాక్టర్‌ను పోలీసులు ఎందుకు సీజ్ చేసి కేసు నమోదు చేశారని ప్రశ్నించారు. ఇసుక విధానం లో టిడిపి నాయకులకో రూలు, వైసిపి నాయకులకో రూలు అధికారులు అమలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. గతంలో తన ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక తరలిస్తుండగా అధికారులు ట్రాక్టర్‌పై కేసు పెడితే తాను దానికి సంబంధించిన ఫైన్ చెల్లించానని చెప్పారు. ఇసుక విధానం అమలులో అధికారులు అనుసరిస్తున్న వైఖరిపై త్వరలో కలెక్టర్, మైనింగ్ అధికారులకు లేఖ రాస్తానని చెప్పారు. భామిని మండలం కాట్రగెడ్డ రీచ్ నుంచి ఇసుక తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ చెప్పారని తెలిపారు. అయితే ఆ రీచ్ నుంచి ఇసుకను జిల్లా నలుమూలలకు ఎలా రవాణా చేస్తారని ధ్వజమెత్తారు. ఇసుక విషయంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానం అమలు చేయకపోవడంతో గందరగోళంగా వుందన్నారు. జిల్లాలో నిర్మాణరంగం కుంటుపడిందని, భవననిర్మాణ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలో కొన్ని చోట్ల టిడిపి నాయకుల నియంత్రణలో ఇసుక రీచ్‌లు నడుస్తున్న పరిస్థితి కనిపిస్తోందని ఆరోపించారు. ఈ విధానం మారకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సాయికృష్ణ చైతన్య ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను అకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. పప్పుచారు ఆ వాసనలేదని నీరులా ఉందని మరోసారి ఇలా తయారు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని వంట ఏజెన్సీలకు హెచ్చరించారు. వంటకాలు ఇలాగే ఉంటే విద్యార్థులు రక్తహీనతకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, భోజన పదార్థాలు తయారీలో మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ఉన్న స్టాకును పరిశీలించారు. అలాగే వీరఘట్టంలోని- 4బి, దుర్గపేట, 4సి గాజుల వీధి అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి పిల్లల హాజరు పట్టిక స్టాక్ నిల్వను పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారితో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్వాడీ కేంద్ర సిబ్బంది, పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యవేక్షణ అవసరం

ప్రజాశక్తి - బలిజిపేట

అనారోగ్య లక్షణాలను గుర్తించిన వారికి, దీర్ఘ కాలిక రోగుల ఆరోగ్యం మెరుగుపడే వరకు క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది పర్యవేక్షణ అవసరమని వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని అరసాడ, బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పిహెచ్‌సిల్లో రికార్డులు తనిఖీ చేసి జ్వరాలు, సీజనల్ వ్యాధులతో ఆసుపత్రికి ఏ మేరకు వస్తున్నారు, వారికి అందజేస్తున్న చికిత్సా వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు రికార్డులో పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలో సందర్శించి డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఫార్మసీ గదిలో మందుల నిల్వలను తనిఖీ చేశారు. మందుల కాలపరిమితిని ఎప్పటికప్పుడు గమనించాలని ఫార్మశిస్ట్‌కు

రోగితో మాట్లాడుతున్న డాక్టర్ జగన్మోహనరావు

సూచించారు. కుక్కకాటు,పాముకాటు ఇంజక్షన్ల లభ్యతను పరిశీలించారు. పిహెచ్‌సిలో ప్రసవాల సంఖ్య మెరుగుపడేలా చర్యలు చేపట్టాలన్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో షిఫ్ట్ డ్యూటీ సిబ్బంది అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణుల ప్రసవ తేదీలకు సంబంధించిన ఇడిడి కేలండర్‌ను పరిశీలించి కాన్పులు పూర్తైన వారి వివరాలు అక్కడ నమోదు చేయాలన్నారు. పిహెచ్‌సి లోపల, బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మిర్తివలసలో హెల్త్‌వెల్నెస్ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. తాగునీటి స్వచ్ఛత పరీక్షలు గ్రామంలో ప్రతి వారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శశిధర్, డాక్టర్ క్రాంతి కిరణ్మయి, డాక్టర్ శివ గాయిత్రి, సూపర్వైజర్లు నారాయణరావు, నాని, చంద్రావతి, జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సాయికృష్ణచైతన్య

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి సాయి కృష్ణ చైతన్య ఇంజనీరింగ్ సహాయకులను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ఎన్టీఆర్ గృహాలకు సంబంధించి సర్వేను వేగవంతం చేయాలన్నారు. వందరోజుల ప్రణాళికల ఆవాసులకు రహదారుల సదుపాయం కల్పించడం, గ్రామాల్లో మంచినీటి నాణ్యతపై పరీక్షలు చేసి వాటి పిఆర్‌వన్ యాప్ ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామాల నుంచి ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, హౌసింగ్ ఎఇ వావిలపల్లి వినోద్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ డి.కావ్యశ్రీ, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

కెవికె సేవలపై విద్యార్థులకు అవగాహన

కురుపాం: కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని కెవికె విస్తరణ విభాగ శాస్త్రవేత్త అనంత విహారి అన్నారు. శుక్రవారం మండలంలో రస్తాకుంటు బాయి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శనకు వచ్చిన 20 విద్యార్థులు కెవికె నుంచి రైతులకు అందిస్తున్న సేవలు గూర్చి వివరించి కెవికెలో ఉన్న పుట్టగొడుగుల పెంపకం, చిరుధాన్యాలు యూనిట్, పౌల్ట్రీ సీడ్ తదితర డెమో యూనిట్లు గూర్చి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కెవికె సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న 'బడితోట'

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలం డోకిశిల గిరిజన సంక్షేమ వసతిగృహం ఆవరణలో వార్డెన్, వ్యాయామ ఉపాధ్యాయుడు కలసి నిర్వహిస్తున్న బడి తోట పెంపకం సత్ఫలితాలను ఇస్తుంది. వసతి గృహాల్లోని కిచెన్ గార్డెన్లో పెంచి తద్వారా విద్యార్థులకు పోషకాలతో కూడిన కూరగాయలను వంటల్లో వినియోగించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు డోకిశిల హాస్టల్ సంరక్షకులు రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు వాసుదేవరావు విద్యార్థులతో కలిసి వివిధ రకాల కూరగాయలను సాగు చేశారు. విద్యార్థులు స్నానాలకు ఉపయోగించే వాడుక నీటితో మొక్కలను పెంచడం ప్రారంభించారు. వాటికి చీడపీడలు రాకుండా, సత్తువను అందించేందుకు ప్రకృతి వ్యవసాయ సహాయకులను సంప్రదించి అవసరమైన ద్రవఅమృతాలను తయారుచేసి మొక్కలకు అందించారు. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే స్థానిక వనరులను ఉపయోగించుకుని నిర్వహించిన బడితోట సత్ఫలితాలను ఇస్తోంది. వీరిని ఆదర్శంగా తీసుకొని మిగతా గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో కూడా పెరటి తోటలు పెంచేందుకు ప్రోత్సహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావు తెలియచేశారు.

ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మోసెస్ వెల్ఫేర్ సొసైటీ విశాఖ పట్టణం వారి సహకారంతో ఎస్ సొసైటీ కార్యదర్శి ఎస్‌కె గౌస్ మండల కేంద్రంలో గల శివన్నపేటలో నిరుపేద ముస్లిం మహిళలకు శుక్రవారం చీరలు, ఖురాన్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర ఖురాన్‌ను చదివి, దాని సందేశం పాటించడం ప్రతి ఒక్క ముస్లిం కర్తవ్యమని అన్నారు. అలాగే రానున్న రోజుల్లో పేద ముస్లింల అభ్యున్నతికి మరింత కృషి చేస్తామని తెలిపారు.

ఖురాన్ అందజేస్తున్న గౌస్

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మ గ్రామానికి చెందిన రఘుమండ్ల జనార్దన్ రావు (42) గడ్డి మందు తాగి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనేక రోజులుగా అనారోగ్యంగా ఉన్నావని, ఈ సమయంలో మద్యం తాగొద్దని భార్య, కుమారుడు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన జనార్ధనరావు ఈనెల 3న గడ్డి మందు తాగి అపస్మారస్థితికి చేరుకున్నాడు. దీంతో బంధువుల సహకారంతో వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈయనకు భార్య గౌరీశ్వరి, కుమారుడు యోగేశ్వరరావు ఉన్నారు. కుమారుడు యోగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు.

కర్రల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని జిల్లేడువలస మీదుగా సరిహద్దుల్లో ఉన్న ఒడిశా నుంచి జెకె పూర్ కాగితపు పరిశ్రమకు కర్రలలోడుతో వెళ్తున్న లారీ శుక్రవారం ఉదయం డోకిశిల పంచాయితీ బుచ్చింపేట దగ్గర రహదారి మలుపు తిరుగుతున్న సమయంలో అదుపుతప్పి లారీ బోల్తా కొట్టింది. అయితే డ్రైవరు అప్రమత్తంగా ఉండడం వల్ల ప్రాణ నష్టం జరగకుండా చాకచక్యంగా వ్యవహరించారు. గతంలో ఇదే మలుపులో ఆటోలు బోల్తాపడి ప్రాణ నష్టం జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఆర్‌అండ్‌బి అధికారులు ఈ మలుపు విషయంలో తగు సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.